# కుక్కలు నూరేళ్ళు బ్రతకవు!

"మంగమ్మ వాళ్ళ కుక్క చచ్చిపోయింది..."

"కుక్కలు నూరేళ్ళు బతకవు...."

"చిన్నపిల్ల రంగమణి గుండెలవిసేలా ఏడుస్తోంది...."

కిటికీలో చూస్తున్న భాస్కరరావుకు, అక్కడికి రెండు వందల గజాల దూరంలో వున్న మంగమ్మ గుడిసె, చచ్చి పడివున్న కుక్క శరీరం ప్రక్కన భోరున ఏడుస్తున్న రంగమణి; రంగమణిని ఓదారుస్తూ, మంగమ్మ కనుపించారు. మంగమ్మ గుడిసె అవతల అన్నీ పొలాలు. చాలా ప్రాంతం పొగాకు పంటలేశారు.

భార్య కనకదుర్గను తేరిపారిచూశాడు భాస్కరరావు. ఆమె కంటిలో కూడా నీటి పొర కనుపించింది.

"మొదటి ఘట్టం పూర్తయింది మళ్ళీ వారం ఈ పాటికి కుక్కలాగే నువ్వు కూడా...." అనుకున్నాడు భాస్కరరావు.

అప్రయత్నంగా చిన్న నవ్వు భాస్కరరావు ముఖంలో కనుపించింది. కనకదుర్గ పోయిన తర్వాత తన స్వంతమయే ఈ పొలాలు, ఆస్తిపాస్తులు తలచుకునేసరికి చిరునవ్వు. చిరు పులకింత వచ్చాయి భాస్కరరావులో. భాస్కరరావు చిరునవ్వు చూసినప్పుడల్లా కనకదుర్గ వళ్ళు ఝల్లుమంటుంది. క్రూరంగా కనుపించే ఆ నవ్వు చూడలేక ముఖం పక్కకు తిప్పుకుని అంది:

"మీరు మద్రాసు ఎప్పుడువెళ్ళాలి?"

తాత్కాలికంగా తన ఆలోచనలు కట్టి పెట్టాడు భాస్కరరావు.

"మళ్ళీ వారం ఇదే రోజు.... మద్రాసు ఆఫీసు పారంభించే ముందు చిన్న పార్టీ ఇవ్వాలి మన ఇంట్లో. మీ మహిళామండలి వాళ్ళను పిలు.... పార్టీ అందే గుర్తుకు వచ్చింది. రంగమణిని పిలుచుకురా.... నాతో పాటు టీ తాగుతుంది..."

కనకదుర్గ కించిత్ ఆశ్చర్యపోయింది. భాస్కరరావు ఇంత ఫ్రీగా మాట్లాడ లేదు ఇదివరకు. ముభావంగా వుండే భర్తలో మార్పు వస్తూందా?

కనకదుర్గ బయటకు వెళ్ళింది.

భాస్కరరావు టేబులుఅరతాళం తెరిచాడు. సీసాలో తెల్లటి భస్మం... టికిల్... టొబాకో ఇనసెక్ట్....



కిల్లర్.... రుచి, వాసనవుండదు. నదిలో త్వరగా కరిగిపోతుంది... పొగాకుమీద ఈ మందు తాలూకు లక్షణాలు రెండు రోజులలో మాయమవుతాయి. ప్రయోగదశలో వున్నప్పుడు ఇంకో వింత విషయం కనిపెట్టారు. ఈ మందు తిన్న పురుగులు ఆనందంగా గెంతాయి.

రంగమణిని తీసుకుని కనకదుర్గ వచ్చింది. రంగమణి లేత బుగ్గలమీద కన్నీళ్ళు చారికలు పెట్టింది. ఇంకా వెక్కుతూనే వుంది.

కనకదుర్గ టీ తీసుకువచ్చింది. రంగమణి తాగుతూవుంటే వంట గదిలోకి వెళ్ళింది. రెండు గుటకలు త్రాగి కప్పు క్రింద పెట్టింది రంగమణి.

పంటి రమాదేవి

"పాపా! టీ వేడిగా వుందా? నేను ఆరబోసి ఇస్తాను...." అని కప్పు తీసుకున్నాడు భాస్కరరావు. చిటికెడు టికిల్ ఆ కప్పులో కలిపాడు. రెండు సెకన్లలో ఆ మందు కరిగిపోయింది. కప్పు తిరిగి రంగమణి కిచ్చాడు.

రంగమణి కప్పులో టీ పూర్తిగా తాగింది టికిల్‌తో సహా.

ఏడుపు మానేసి నవ్వుకుంటూ, గెంతుకుంటూ బయాటకు పరుగెత్తింది.. పొగాకు పంటకు పట్టిన చీడపురుగులు కూడా ఆ మందు తిన్నప్పుడు అలాగే గెంతాయి.

చెంగున పోతూన్న రంగమణినిచూసి భాస్కరరావు అనుకున్నాడు.

"ఇంకా నలభై ఎనిమిది గంటలు........"

○ ○ ○

ఆ రోజూ, మర్నాడు రంగమణిని భాస్కరరావు గమనించాడు. 'టికిల్' వున్న మరో గుణం.... ఆ విషం శరీరంలో పనిచేస్తున్న సంగతి, టికిల్ తీసుకున్న వారికి తెలియదు. రెండు రోజుల తర్వాత గుండెలో బృహద్ధమనిలో చేరి గుసగుస సంగతి. గుండెకు రక్త సరఫరా ఆగిపోయేటట్లు చేస్తుంది. కొంత సేపటికి కాలేయం ద్వారా మూత్రపిండాలలో ప్రవేసిస్తుంది. అక్కడవుండే విష పదార్థాలలో ఒకటిగా మారిపోతుంది.

రంగమణి మామూలుగా వుంది.....

టీ తాగిన రెండురోజులకు, రంగమణి తల్లి మంగమ్మ ఆకాశం దద్దరిల్లేలా ఏడుస్తూవుంటే భయభ్రాంతురాలయిన కనకదుర్గ బయటకు పరుగెత్తింది.

ఆడుకుంటూ ఆడుకుంటూ రంగమణి గుండె ప్రదేశంలో గట్టిగా పట్టుకుని నేల కూలింది. మంగమ్మ కంగారుగా వచ్చి క్రింద పడకుండా పిల్లను పట్టుకునే లోపలే రంగమణి ఆఖరి శ్వాస విడిచింది.


"ఏమండీ! రంగమణి పడిపోయింది...." అని కంగారుగా పరుగెత్తుకు వస్తున్న కనకదుర్గను చూసి పెల్లుబుకి వస్తున్న ఆనందాన్ని అపుకుంటూ. విచారంగా ముఖం పెట్టాడు భాస్కరరావు.


ఇప్పటినుంచి ప్రాక్టీస్ చేయాలి! కనకదుర్గ పోయిననాడు అనేకమంది చూస్తూ వుంటారు. ఆ రోజు పెర్‌ఫెక్ట్ నటన ప్రదర్శించాలి!

○ ○ ○

రంగమణి అంతిమసంస్కారలయిన తర్వాత రోదిస్తూ ఆ రోజు మంగమ్మ కనకదుర్గ దగ్గరే వుండిపోయింది.

భాస్కరరావు మెదడులో మెరుపులా ఆలోచన వచ్చింది. "టికిల్" మంగమ్మకు కూడా ఇస్తే! చాలా లాభాలున్నాయి. పెద్ద వాళ్ళలో "టికిల్" ఎలా పనిచేస్తుంది తెలుసుకోవచ్చు. రెండు రోజులలో ఇద్దరు పోయారంటే జనంలో భయం ప్రవేశిస్తుంది. ఏదో కొత్త రోగం వచ్చి జనం చస్తున్నారని నమ్మించొచ్చు. జిల్లా హెల్త్ ఆఫీసరుకు రిపోర్టు ఇస్తే అదో సాక్ష్యం. కనకదుర్గ పోయినప్పుడు ఆ రోగంతో పోయిందనుకుంటారు. పోస్టు మార్టం చెయ్యమని గొడవచేస్తాడు తను. అది అవసరం లేదంటాడు హెచ్.వో. పోస్టుమార్టమ్ చేయమని పోలీసులు అన్నా చింతలేదు. టికిల్ కిడ్నీలో వుండే మామూలు





టాక్సేన్స్‌లో ఒకటిగా మారిపోతుంది.

"దుర్గా! నువ్వు మంగమ్మ దగ్గర వుండు. టీ నేను చేసి తీసుకువస్తాను" అన్నాడు భాస్కరరావు.

పొగలు కక్కుతున్న టీ ముగ్గురూ త్రాగారు భాస్కరరావు, కనకదుర్గ, మంగమ్మ.

"మంగమ్మా! మా కెమికల్ ఫ్యాక్టరీ సేల్సు, ఆఫీసు మద్రాసులో కొత్తగా ప్రారంభిస్తున్నాం. నాలుగయిదురోజుల్లో వెళ్ళాలి. అమ్మగారికి నువ్వే సాయంగా వుండాలి.... నాకు ఇక్కడకు వచ్చే అవకాశం తక్కువ...."

భాస్కరరావు మాటలు విని, నవ్వి అంది మంగమ్మ "అలాగే బాబూ! అమ్మగార్ని నా తోబుట్టువులా చూసుకుంటా..."

'ఇంకా నవ్వు కుంటూనే వుంది మంగమ్మ,

టికిల్ పని చేస్తోంది.

ం ం ం

మంగమ్మ గుడిసె తలుపులు ఆ రోజు తెరుచుకోలేదు. మధ్యాహ్నం భాస్కరరావుకు టెలిఫోను వచ్చింది.

ఆ టెలిఫోను కోసం ఎదురుచూస్తూ వున్నాడు.

"దుర్గా! ఏమిటీ వేళ ఫోన్ చేసావ్!"

అవతలనుంచి వచ్చిన సంభాషణతో భాస్కరరావు ముఖంలో వచ్చిన మార్పులు చూసి, అక్కడేవున్న మార్కెటింగ్ మేనేజర్ మత్స్యవాహనరావు అడిగాడు ఆత్రతగా.

"ఏమయింది?"

"మా పని మనిషి మంగమ్మ పోయింది... మిస్టీరియస్‌గా... వాళ్ళ ఇంట్లో ఇది మూడో చావు ........

ఐ సస్పెక్ట్ కంటేమినేషన్ ... ప్రోబబ్లీ వాటర్ కంటేమినేషన్... సార్... నేను వెళ్ళాలి... ఆవిడకు ఎవ్వరూ లేరు...."


అని ప్రాధేయపూర్వకంగా ఆయన్ను చూసి అన్నాడు.

"సర్! మన జిల్లా హెల్త్ ఆఫీసర్‌కి రిటిన్ కంప్లయింట్ ఇవ్వగలరా... నా తరపున..."

మత్స్యవాహనరావు సరే అనగానే భాస్కరరావు బయటకు నడిచారు.

ం ం ం





ఆ రోజు భాస్కరరావు ప్రయాణం. సాయంత్రం నాలుగు గంటల రైలులో మద్రాసుకు.

మధ్యాహ్నం, కనకదుర్గ స్నేహితురాళ్ళు, మహిళా మండలి సభ్యులు సమావేశమయ్యారు భాస్కరరావు ఇంట్లో.

మంగమ్మ హఠాన్మరణం షాక్‌నుండి కనకదుర్గ ఇంకా కోలుకోలేదు. 'సర్వోత్తమ' కేటరర్స్ పార్టీ ఏర్పాట్లు చూస్తున్నారు.

భాస్కరరావు ట్రేలో కాఫీ తీసుకువచ్చి అందరకూ ఇచ్చాడు.

కనకదుర్గ కూడా భాస్కరరావు ఇచ్చిన కాఫీ తాగింది.

విచారం మర్చిపోయి హుషారుగా వుంది ఆ తర్వాత. భాస్కరరావు కనకదుర్గలో వచ్చిన మార్పు గమనించాడు.

మహిళామండలి అధ్యక్షురాలు కనకదుర్గతో అంది.

"మీ తలనొప్పి ఇప్పుడు పోయినట్టు ఉంది... ఉల్లాసంగా ఉన్నారు...అప్పుడప్పుడు మిమల్ని బాధపెట్టే ఆ తలనొప్పి శాశ్వతంగా పోయే ఓ చిట్కా చెబుతాను..."

అధ్యక్షురాలు చెబుతున్న మాటలు శ్రద్ధగా వింటోంది కనకదుర్గ.


* * *

ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. రెండో రోజు టెలిఫోనో, టెలిగ్రామో వస్తుంది- కనక దుర్గ, మంగమ్మను వెతుక్కుంటూ వెళ్ళినప్పుడు తను అద్భుతంగా ఏడుస్తాడు. కనకదుర్గ పేరన ఉన్న లక్షల ఆస్తి తన వశమవుతుంది. పురుగుల మందు అమ్ముకుంటూ వూరూరా తిరగవలసిన ఉన్న లక్షల ఆస్తి తన వశమవుతుంది. పురుగుల మందు అమ్ముకుంటూ వూరూరా తిరగవలసిన ఖర్మ తప్పుతుంది. కనకదుర్గ ఆస్తిలో చిల్లిగవ్వ కదిల్చేది కాదు పది రోజుల కర్మకాండ తర్వాత రెక్కలొచ్చిన పక్షిలా ఎగరి పోవచ్చు.

రైలు చేసే లయబద్ధమైన చప్పుడుతో భాస్కరరావు వూహలు సాగుతున్నాయి.

టైము చూసుకున్నాడు భాస్కరరావు.... రాత్రి ఏడున్నర... లంఖణాల బండిలా నడుస్తోంది ఎక్స్‌ప్రెస్ రైలు బయట వాన...గాలి...సిటీదాటి ముప్పై మైళ్ళు దాటలేదు...





హఠాత్తుగా చప్పుడు... బెర్త్ మీద పడుకున్న భాస్కరరావు ముఖానికి తిరుగుతున్న ఫేను తగిలింది. కాలిమీద బండరాయి పడ్డట్టనిపించి కెవ్వున అరిచాడు... రైలు చక్రాల 'దడ్‌దడ్' శబ్దం ఆగిపోయింది. మంచుకొండలు ఎండ వేడికి కరుగుతున్నట్టు పెటీల్మన్న శబ్దాలు లీలగా విన్నాడు భాస్కరరావు...తర్వాత స్పృహ తప్పింది.

* * *

కళ్ళు తెరిచాడు. పరిసరాలు పరికించాడు. ఆసుపత్రిలో వున్నట్టు కొంతసేపటికి తెలిసింది...

"రక్తం చాలా పోయింది. ఎక్కించాలి..."

"ఎక్కించండి..."

"అయితే ఒకటి...ఈయన గ్రూపు రక్తం లేదు..."

"తెప్పించండి...."

"అయితె ఒకటి... ఈయన్ది రేర్ గ్రూప్..."

"మరి ఈయన పని........"

"అయితే ఒకటి...ఆ గ్రూప్ రక్తం వున్న మనిషిని పట్టుకున్నాం... వెతిక... వెతికి..."

"ఇంకా ఆలస్యం ఎందుకు?"

భాస్కర రావు మంచం సమీపంలో ఇద్దరు డాక్టర్లు మాట్లాడుకుంటున్నారు.

"అయితే ఒకటి.... రక్తం ఎక్కించిన వెంటనే చూపించాలిట రోగిని...."

ఆ తర్వాత మాటలు వినలేకపోయాడు భాస్కర రావు.... అతనికి మళ్ళీ తెలివి తప్పింది.

* * *

పొగమంచు కప్పబడి వున్న దృశ్యంలా ముందు అస్పష్టంగా - తర్వాత స్పష్టంగా కనపడింది భాస్కర రావుకు.... డాక్టర్ల నవ్వుముఖంచూశాడు.

"యు ఆర్ లక్కీ. మీగ్రూప్ రక్తం వున్న మనిషి సమయానికి దొరికింది. మీరు అన్‌కాన్షస్ స్టేజీలో ఎన్నాళ్ళున్నారో తెలుసా.... రెండు రోజులు. రాత్రి ఏక్సిడెంటయింది. మర్నాడు మధ్యాహ్నం ఆసుపత్రికి తెచ్చారు...."

భాస్కర రావుకు కనకదుర్గ గుర్తుకు వచ్చింది హఠాత్తుగా.... టికెట్ తీసుకుని నలభై ఎనిమిది గంటలు దాటింది .... కనక దుర్గ ప్రాణం పోయి....

"ఆసుపత్రిలో ఇంకా నెల రోజులుండాలి.... అప్పటికి పూర్తిగా నయమవుతుంది.... అ.... మీ రక్తదాత మిమ్మల్ని చూడాలంటున్నారు...."

భాస్కరరావుకు సంతోషంగావుంది. కనకదుర్గ మీద పడి ఏడ్చే సీను అభినయించక్కర్లేదు. ఎవరికీ అనుమానం రాకుండా దుర్భేధ్యమైన ఎలిబీ.... నెల రోజులు ఎలాగో గడిపేస్తే....

తన మంచ దగ్గరగా వస్తున్న ఆకారాన్ని చూసి కపాలంలో బాంబు పేలినట్లు అదిరి పడ్డాడు. ...

కనకదుర్గ ఎండుగా నవ్వుతూ వస్తుంది...

"నా మాంగల్యం గట్టిదండీ.... సమయానికి నా గ్రూపు రక్తం మీ గ్రూపు రక్తం సరిపోయాయి.... చిన్న దెబ్బలేట... తగ్గిపోతాయన్నారు...."

భాస్కరరావు గుడ్లు తేలవేసి చూస్తున్నాడు.... కనకదుర్గ ఎలా బతికింది? టికిల్ స్వయంగా తానే ఇచ్చాడే ....

"మత్స్యవాహన రావుగారు జిల్లా ఆరోగ్య శాఖాధికారిని తీసుకువచ్చారు... వంటిట్లో గ్యాసు పొయ్యి దగ్గర వుంచిన మందు సీసా తీసుకెళ్ళారు. ఆ మందువల్లే.... "

వేగంగా వెడుతున్న రైలు బండి పాయింట్ల దగ్గర రైలు చక్రాలు చేసే శబ్దంలా వేగంగా దడ్ దడ్ దడ్ మని కొట్టుకుంటూ వుంది భాస్కరరావు గుండె.

"మహిళా మండలి అధ్యక్షురాలు, తలనొప్పి పోవడానికి చిట్కా చెప్పిందండి... అది బాగా పనిచేస్తూవుంది... ఆ పని ఆడవాళ్ళు చెయ్యరు. విధిలేక నేను చేయాల్సి వచ్చింది... నన్ను క్షమిస్తారు కదూ.... "

భాస్కరరావు ముఖంలో రక్తం తగ్గిన సూచనలు కనిపిస్తున్నాయి.

"కనకదుర్గ ఎలా బతికింది! తిరుగులేని "టికిల్" ఎందుకు ఫెయిలయింది..."

భాస్కరరావు శ్వాస భారంగా తీస్తున్నాడు...

"ఎలా జరిగిందది... మత్స్యవాహనరావు టికిల్ గురించి కూపీ లాగుతాడా? ... తరువాత ఏమవుతుంది? "

భాస్కరరావులో వేగంగా వస్తున్న మార్పులు చూసిన డాక్టరు ఆక్సిజన్ యూనిట్ కోసం కంగారుగా పరుగెత్తాడు.

"ఆడవాళ్ళు ఎవరూ చేయని పనినేను చేశానండి.... తలపోటు భరించలేక. అయితేనేం బాగా పని చేసింది. "

కనకదుర్గ భర్త చెవి దగ్గర నోరు పెట్టి రహస్యంగా అంది. "ముక్కు పొడుం. దానితో నాతలనొప్పి పూర్తిగా పోయింది. "

భాస్కరరావు గది ద్వారంలో మత్స్యవాహన రావు నిలబడి వున్నాడు నవ్వుతూ.

అంతులేని చీకటి అగాధాలలో పడిపోతున్న భాస్కరరావుకు తోచింది అప్పుడే.

టికిల్ ఏంటి డోస్ ముడ్చిన పొగాకు.

ఆక్సిజన్ తెచ్చిన డాక్టరు భాస్కరరావును చూసి ఆగిపోయాడు.

ఆసుపత్రి బయట ఖైచివున్న పత్రికా విలేకరులు వార్త పంపించారు.

రైలు ప్రమాదంలో మరణించబడిన వారి సంఖ్య, ఆసుపత్రిలో మరొకరు పోవడంతో ... పెరిగింది- అని. •




**రూ. 1,00,000 ల విలువగల బహుమతులు గెలవండి**



(మాదిరి మొత్తం 15) (B)

| | | |
|---|---|---|
| 4 | 9 | 2 |
| 3 | 5 | 7 |
| 8 | 1 | 6 |

మొదటి బహుమతి :- నేపాల్‌కు విమాన ఉచితయాత్ర (ఫైవ్ స్టార్ హోటల్‌లో బసకు ఉచిత ఏర్పాట్లు) లేదా నగదు 10,000/-.
కన్సోలేషన్ బహుమతులు : జపాన్ మోడల్ సోనీ టు ఇన్-వన్ (బ్రైన్ స్కీమ్)
కాగితంపై 9 ఖాళీ గళ్ళను గీసి 2 నుండి 10 వరకు అంకెలను ఒకేసారి ఉపయోగిస్తూ ఎటుకూడినా మొత్తం 18 రావాలి. ఎంట్రీలు 15 రోజుల్లో చేరాలి.

SHIVA SALES (JH)
P. B. No. 7026, New Delhi-110 002.

**WIN PRIZES OF Rs. 75,000**

**FIRST PRIZE : COLOUR T. V. OR Rs. 7,000/- Cash**

ద్వితీయ బహుమతి : 8 స్పీడ్ మిక్సీ లేక 2 స్పీడ్ మిక్సీ సగం ధరలో
తృతీయ బహుమతి : మా పరస్పర సహాయ పథకం క్రిందుగా రూ. 170/- కు జపాన్ మోడల్ టూ-ఇన్-వన్.

| | | |
|---|---|---|
| 12 | 5 | 10 |
| 7 | 9 | 11 |
| 8 | 13 | 6 |

TOTAL: 27

ప్రవేశ రుసుము లేదు.

నిబంధనలు : 6 నుండి 14 వరకు ఒక అంకెను ఒకేసారి ఉపయోగిస్తూ ఎటుకూడినా 30 వచ్చేటట్లుగా తెల్ల కాగితం లేదా పోస్ట్ కార్డుపై వ్రాసి పంపాలి. ఒక కుటుంబానికి ప్రవేశ ఫారం ఒకటి మాత్రమే. ఢిల్లీ అధికారానికి లోపటగా. ఇంగ్లీషు, హిందీలలో మాత్రమే వ్రాసి, 15 రోజుల లోపటగా మీ ఎంట్రీని పంపండి.

**Mec. (India)** (SM-3) Post Box No: 6595, New Delhi-110027.